క్లుప్తంగా

సర్పంచులకు ప్రాధాన్యం కల్పించండి



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచులు

లేపాక్షి: స్థానిక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సౌజన్యలక్ష్మిని మండలంలోని సర్పంచ్‌లు మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యం కలిగించాలని విన్నవించారు. తప్పకుండా ప్రాధాన్యం కల్పిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి

హిందూపురం అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మించనున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పలువురు దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి విరాళాలు ప్రకటించారు. మంగేష్ రూ.2,01,116, మార్కెట్ కమిటీ వారు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు జేఈ వెంకటస్వామి, రఘు, చంద్రశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

చర్చా వేదికలో పాల్గొన్న దర్గా పీఠాధిపతి



రాష్ట్ర ముతవల్లీలతో పీఠాధిపతి తాజ్‌బాబా

పెనుకొండ: వక్ఫ్ సవరణ చట్టం – 2024 అఖిలపక్ష చర్చావేదిక అనంతపురంలో సోమవారం జరిగింది. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా పాల్గొన్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ముతవల్లీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పీఠాధిపతి పాల్గొని వక్ఫ్ సవరణ చట్టం బిల్లుకు సంబంధించి పలు విషయాలపై చర్చించారన్నారు.

సందడిగా 'గ్రీన్‌డే'



గ్రీన్‌డేలో పాల్గొన్న చిన్నారులు

పెనుకొండ: పట్టణంలోని గ్లోబల్‌జెన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రీన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కూరగాయలు, పండ్ల వేషధారణలో ఆకట్టుకున్నారు. గోగ్రీన్ అంటూ విద్యార్థులు నినదించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి, డైరెక్టర్స్ సాయి సృజన, సాయి శ్రీధర్ పాల్గొన్నారు.

'ఆలయ జీర్ణోద్ధరణ' ప్రారంభం

హిందూపురం: పట్టణ నడిబొడ్డున ఉన్న పేట వేంకటరమణస్వామి ఆలయ విమాన గోపుర కలశ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ కుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు గోధూళివేళ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, వాస్తు, కణహోమం చేపట్టారు.

నాణ్యమైన విద్య బోధించండి



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి అశోక్‌కుమార్

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం మడకశిర కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్‌కుమార్ సందర్శించారు. అనంతరం తరగతి గదుల పరిశుభ్రత, భోజన నాణ్యతను పరిశీలించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు.

ఎండుతున్న ఆశలు



చిలమత్తూరు సమీపంలో ఎండుతున్న మొక్కజొన్న

- అన్నిచోట్లా వర్షాభావ పరిస్థితులు
- వాడిపోతున్న మొక్కజొన్న, వేరుశనగ
- ఆలస్యంగా ఈక్రాప్ నమోదు చేపట్టడంపై అన్నదాతల ఆందోళన

హిందూపురం అర్బన్/చిలమత్తూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఈసారి వర్షాలు ప్రారంభమవడంతో కోటి ఆశలతో ముందస్తుగానే చాలా మంది రైతులు పంటలు వేశారు. అయితే ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో పంటలన్నీ ఎండుతున్నాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

3,23,294 హెక్టార్లలో పంటలు

జిల్లాలోని 32 మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 3,23,294 హెక్టార్లు కాగా .. 2,44,763 హెక్టార్లలో అన్నదాతలు పంటలు వేశారు. ఇందులో దాదాపుగా 20 వేల హెక్టార్లలో బోర్లు, బావుల కింద పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు బాగా పడి ఉంటే ఈ పాటికి పంటలు కళకళలాడుతుండేవి. ప్రారంభంలో కాస్త వర్షాలు పడినా ఆ తర్వాత మాత్రం వరుణుడు కరుణించకపోవడంతో కర్షకులు తల్లడిల్లిపోతున్నారు. వర్షాభావంతో ఇప్పటికే 26 వేల హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా మొక్కజొన్న, వేరుశనగ పంటలపై వర్షాభావం తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు.

పంటలను కాపాడుకునేందుకు...

ఆశలతో సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతుల గుండె తరుక్కుపోతోంది. ఎండు ముఖం పట్టిన పంటలను ఎలాగైనా కాపాడుకోవాలని కొందరు రైతులు బోర్లు, బావుల కింద సాగు చేసిన పంటలను తడిపేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇక వర్షాధారం కింద సాగు చేసిన పంటలు ఇప్పటికే దాదాపుగా నష్టపోయినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండే సమయంలో ఇప్పుడు ఈ క్రాప్ బుకింగ్ ప్రారంభించడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. సకాలంలో పంట నమోదు ప్రక్రియ చేసి ఉంటే ప్రయోజనం ఉండేదని రైతులు అంటున్నారు.

సాధారణ వర్షం కంటే తక్కువ...

విత్తనం విత్తింది మొదలు తరువాత ఒకసారి మాత్రమే వర్షం కురవడంతో ఇప్పటి వరకు పంటలు తట్టుకున్నాయి. ఇప్పుడు వర్షం లేక నిలువునా ఎండుతున్నాయి. ప్రధానంగా వర్షాధారం కింద సాగైన మొక్కజొన్న, కంది, వేరుశనగ పంటలు వేశారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 55 ఎంఎం కాగా అత్యధికంగా 132.4 ఎంఎం వర్షం కురిసింది. తరువాత జూలైలో అరకొరగా వర్షం పడింది. సాధారణ వర్షం కంటే 45.6 ఎంఎం తక్కువ వర్షపాతం కురిసింది. దీనికి తోడు విపరీతంగా గాలులతో భూమిలోని తడి అంతా పూర్తిగా ఆరి పోయింది. ఫలితంగా పంటలు ఎండుతున్నాయి.

పంట ఎండిపోతోంది



జూన్ నెలలో వర్షాలు కురవడంతో ఈ సారి పంటలు బాగా చేతికి వస్తాయన్న ఆశతో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాం. అలాగే గొల్లపల్లి వద్ద కౌలు రైతుల ద్వారా మరో 3 ఎకరాల్లో వేరుశనగ వేయించాను. అయితే జూలై నెలలో వాన నేల రాలకపోడవంతో పంటలు వాడిపోతున్నాయి. మరో 3 రోజుల్లో వాన రాకపోతే ఈ సారి పంట చేతి కందదు.

– ఫకృద్దీన్, రైతు, చిలమత్తూరు

ఏం చేయాలో అర్థం కావడం లేదు



జూన్ నెలలో పూర్తి తడి తరువాత వానలు సరిగా పడలేదు. దీంతో పంటలో కలుపు కూడా తీయలేదు. నిలువునా పంటలు ఎండుతున్నాయి. మొక్కజొన్న చేతికి అందడం కష్టమే. పెట్టుబడి పెట్టుబడులు పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– అశ్వర్థరెడ్డి, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

వక్క రైతుల సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: నియోజకవర్గంలోని వక్క రైతులు సోమవారం పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి ప్రభుత్వం తమను ఆదుకోవడానికి వెంటనే చర్యలు తీసుకునే విధంగా చూడాలని కోరారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా వక్క రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వక్క మార్కెట్ ఏర్పాటు చేయాలని, సబ్సిడీతో వక్క రైతులకు విద్యుత్ సరఫరా చేయాలని, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న జిల్లా డి అడిక్షన్ సెంటర్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి

హిందూపురం అర్బన్: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని జిల్లా డీ అడిక్షన్ సెంటర్ మేనేజర్ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యసనాలు, పర్యవసనాలు– నివారణ మార్గాలు అనే అంశంపై హిందూపురం స్పేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి పలు సూచనలు, సలహాలిచ్చారు.

'సర్దుబాటు'పై ఉపాధ్యాయుల నిరసన



హిందూపురం: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



పెనుకొండ: ఎంఈఓ సుధాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు



మడకశిరలో ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా, అసంబద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందజేశారు. జీఓ నంబర్ 117 రద్దు చేసి జీఓ ఎంఎస్ నంబర్ 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, నాగరాజు, నారాయణస్వామి, ఆదినారాయణ, బాబు, చెన్నకేశవలు, శ్రీనివాసులు, గోపాల్, షమీవుల్లా, సిద్దగిరి శ్రీనివాసులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: జీ.ఓ.117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపి ఎంఈఓ అంజనేయులునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, సంజీవరాయుడు, రామకృష్ణనాయక్, నాగరాజు, రంగేష్ కుమార్, దస్తగిరి, చౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: ఉపాధ్యాయుల పని సర్దుబాటును బాయ్‌కాట్ చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మార్సీ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో చైర్మన్ కోడూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌టీఎఫ్ సంఘాల నాయకులు కాడిశెట్టి శ్రీనివాసులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, శ్రీరాములు, ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు అమరాచంద్రబాబు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

గుడిబండ: ఉపాధ్యాయులకు ఇబ్బంది కలుగజేసే విధంగా ప్రస్తుతం జరుగుతున్న అనధికార రేషనలైజేషన్ ప్రక్రియ అసంబద్ధంగా ఉందంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎంఈఓ–2 రవిచంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆదినారాయణ, నాగరాజు, వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఉపాధ్యాయులు సర్దుబాటును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు స్థానిక ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు.

రొళ్ల: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల పని సర్దుబాటును వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈఓలు శ్రీధర్, మోహన్‌లకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఏపీటీఎఫ్ జోన్ ఉపాధ్యక్షుడు యంజారప్ప, మండలాధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు రెడ్డప్ప, రమేష్, గురుమూర్తి, ప్రభాకర్, గంగప్ప, వినోద్, మహేష్, నరేంద్ర, అనిల్, ముష్కిన్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: ఉపాధ్యాయులను సర్దుబాటు నిర్ణయానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాలు గోరంట్లలో సోమవారం నిరసనకు దిగాయి. నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్పకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దామోదరరెడ్డి, అశోక్‌కుమార్, నరేంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, కిష్టప్ప, చాంద్‌బాషా, వెంకటేశు, మురళి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి మారుతి, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆంజనేయులు, ఏపీయూఎస్ రమేష్, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయండి



హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రవితేజారెడ్డి అధ్యక్షతన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఊపి ర్యాలీను ప్రారంభించారు. ఈనెల 14, 15, 16వ తేదీల్లో ఇళ్లపై జాతీయ జెండాలు ఎగరేయాలని పిలుపునిచ్చారు.

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం

పెనుకొండ: పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్, నాయకులు సాయి, తేజ, బాలాజీ, వంశీ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయులు

గుడిబండ: అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం పాల్తూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సత్యవరప్రసాద్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గుడిబండ మండలంలోని ఉపాధ్యాయ బృందం స్పందించి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ మొత్తాన్ని సోమవారం ఎంఈఓ రవిచంద్రకు అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



సర్పంచుల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

మడకశిర/రొళ్ల/అమరాపురం/లేపాక్షి/హిందూపురం టౌన్/మడకశిరరూరల్/గుడిబండ: గ్రామాల్లో నెలకున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి అన్ని విధాలుగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి సర్పంచులు కృషి చేయాలని ఎంపీడీఓలు, అధికారులు సూచించారు. మడకశిర, రొళ్ల, అమరాపురం, లేపాక్షి, హిందూపురం, గుడిబండ మండల కేంద్రాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. తాగునీటి సమస్య, పైపులైన్ లీకేజీ, వీధి దీపాలు, డ్రైనేజీ శుభ్రం, వర్మికంపోస్టు తయారీ విధానం వంటి ఇతరాత్ర అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

పరిగి: మండల ఎంపీడీఓగా సరస్వతి బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయ సిబ్బందితో పాటూ మండల వ్యాప్తంగా పని చేస్తున్న పంచాయతీ సెక్రటరీలు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు.

రొళ్ల: మండల ఎంపీడీఓగా కె.ఆజాద్ బాధ్యతలు సోమవారం స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ప్రసాద్ ఇన్నాళ్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేశారు.

మడకశిర: మడకశిర ఎంపీడీఓగా సోనిబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఆమె బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్లిన విషయం తెలిసిందే. సోనిబాయి బాధ్యతలు స్వీకరించడంతో సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

చిలమత్తూరు: మండల ఎంపీడీఓగా నరేష్‌కృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరుపున మైక్ సెట్ వితరణ చేశారు. సోమవారం పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌గౌడ్‌కు మైక్ సెట్ అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేష్, మల్లికార్జున, ఉపాధ్యాయులు నారాయణస్వామి, కృష్ణానాయక్, లక్ష్మీనరసమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

లేపాక్షి: ప్రభుత్వ అనుమతి లేకుండా మండల వ్యాప్తంగా ఎవరైనా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో జేసీబీ, ట్రాక్టర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రైవేటు లే అవుట్లు, కమర్షియల్ ల్యాండ్, ఫాంహౌస్‌లకు మట్టిని తరలించుకోవాలన్నా ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే జేసీబీలకు రూ.లక్ష, ట్రాక్టర్లకు రూ.25 వేల అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ కుమార్ స్వామిరెడ్డి, ఏఎస్ఐ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

చిలమత్తూరు: మండలంలోని చాగలేరులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి సోమవారం ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు వీలుగా దాదాపు రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేంద్రబాబు, బాలాజీ, మండల కన్వీనర్ రంగారెడ్డి, శ్రీదేవి, గంగాధర్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలేవీ?

పరిగి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక దోపిడీ అధికమైందని, అడ్డుకునే వారిపై ఎదురు దాడికి తెగబడుతన్నారని జైభీం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఊటుకూరు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా మండలంలోని ఊటుకూరు, పరిగి, శాసనకోట, నేతులపల్లి, శీగపల్లి, పైడేటి గ్రామ పరిధిలోని పెన్నా, జయమంగళీ నదుల నుండీ టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుకను అక్రమ తరలిస్తున్నట్లు ఆధారాలతో సహా పోలీసులకు, రెవెన్యూశాఖ అధికారులకు సమాచారం అందించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సంక్షిప్త సమాచారం

స్టేటస్ కో ఉత్తర్వులు అమలు చేయండి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని 700 సర్వే నంబరులో పేదల వేసుకున్న గుడిసెలకు ఇబ్బంది కలిగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులు అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి అధికారులకు విజ్ఞప్తి చేశారు. పంచాయతీ అధికారులు ట్రాక్టర్ల ద్వారా చెత్త తీసుకొచ్చి డంప్ చేస్తున్నారన్నారు. పేదలకు ఇబ్బంది కలిగించకూడదని పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఆస్తిపన్ను క్రమబద్ధీకరణ వారోత్సవాలు

హిందూపురం: పట్టణ వాసులు ఆస్తి పన్ను చెల్లించడానికి ఇబ్బంది పడకుండా ఆస్తి పన్నుల క్రమబద్ధీకరణ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి హాజరై మాట్లాడారు. త్వరలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించండి

హిందూపురం టౌన్: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాల్మీకి బోయ యువజన సంఘం పార్లమెంట్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ కోరారు. ఇందులో భాగంగానే సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. వాల్మీకి సంఘం పెద్దలు రామకృష్ణ, బీఎస్ మూర్తి, కాలవ రాము, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలి

మడకశిర: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వడానికి షరతులు విధించడం అన్యాయమని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా విమర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏఐవైఎఫ్ నాయకుల సమావేశం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు విధించకుండా నిరుద్యోగులందరికీ నెలకు రూ.3 వేల చొప్పున ఇవ్వాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చిరు వ్యాపారుల నిరసన

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఇన్‌చార్జ్ పవిత్ర ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు సోమవారం నిరసన తెలిపారు. మండీ వ్యాపారుల వల్ల తాము నష్టపోతున్నామని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రంగస్వామికి వినతిపత్రం అందించారు.

వీఎస్ఎస్ఎన్ ఎన్నికల్లో జేడీఎస్ గెలుపు

పావగడ: తాలూకాలోని వెంకటాపురం గ్రామం వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సహకార సంఘం) ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ విజయభేరి మోగించింది. 12 స్థానాల్లో 8 స్థానాలను జేడీఎస్ కైవసం చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 4 స్థానాలు మాత్రమే గెలుచుకుని రెండో స్థానానికి పరిమితమైంది.

వైభవంగా శివలింగం ప్రతిష్ట

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ట ఘనంగా జరిగింది. సోమవారం వేకువజాము నుంచే పురోహితులు మహాగణపతి, శివలింగం, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వర విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం, విమాన గోపుర ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున కలశాలను ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.



ప్రతిష్టించిన శివలింగం

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

పావగడ రామకృష్ణ సేవా ఆశ్రమ అధ్యక్షుడు జపానందర స్వామీజీ, సిద్దరబెట శ్రీక్షేత్ర వీరభద్ర శివాచార్యస్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. దీని వల్ల మంచి జరగడంతో పాటు వరుణదేవుడు కరుణిస్తారన్నారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వైటీ ప్రభాకర్‌రెడ్డి, ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న మహిళలు